# ఏరు పొంగింది

**-విపంచి**

**చుట్ట ముట్టిస్తూ** ఆకాశంలో కేసి చూశాడు స్వామినాయుడు. మబ్బులు ఆకాశాన్నంతా ఆక్రమించుకొన్నాయి. చంద్రుడికి కాస్తంత జాగా కూడా ఇవ్వలేదు.

నిన్న మధ్యాహ్నం నుంచి ఈ మబ్బు లిలా స్వైర విహారం చేస్తునే వున్నాయి. అయినా వాటికి అలుపూ, ఆయాసం ఉన్నట్లు లేదు. కుండ పోతగా వర్షం కురుస్తునే వుంది.

'ఈ ఏడు వర్షాలు విపరీతంగా వున్నాయి' అనుకొన్నాడు స్వామినాయుడు. "ఇలాగైతే పంట దెబ్బ తినటం ఖాయం." ఆ మాట నిన్న రాత్రి నుంచి అనుకొంటునే వున్నాడు. నోటి దగ్గర కొచ్చిన కూడు నేల పాలయినంత బాధ.

"పాడు వాన! బంగారంలాంటి పైరుని పొట్టబెట్టుకుంది." చుట్ట నోట్లోంచి తీసి, తువుక్కున ఉమ్మేశాడు స్వామినాయుడు.

నేలంతా బురద. కాలువేస్తే జర్రున జారి పోయేటట్లు ఉంది. అసలే శ్యామలాపురంలో వీధి లైట్లు లేవు. ఉన్నా, వెలిగే పరిస్థితి కాదది.

కత్తులు ఝుళిపిస్తున్నట్లు మెరుపులు మెరుస్తున్నాయి. చలిగాలి 'ఉఁ'దరమని వీస్తూంది.

జల్లు మొహంమీద కొట్టటంతో అరుగు మీది నుండి లోపలికెళ్ళాడు స్వామినాయుడు. కోడిగ్రుడ్డు చిమ్నీలో భద్రంగా తలదాచుకున్న కాంతి ఏ క్షణాన్నైనా ఆరిపోవటానికి సిద్ధంగా ఉంది.

ఇంట్లోని అందరూ ఆ గదిలోనే గుమికూడారు. అప్పుడప్పుడూ ఇంట్లో చూరు నుండి వాన చినుకులు 'టప్, టప్'మని పడుతున్నాయి.

అవి పడుతున్నప్పుడల్లా భయంతో బిగుసుకుపోతున్నారు ఆ ఇంట్లో వారు.

"మొన్న ఇల్లు నేయించుంటే బావుండేది." మౌనంగా వుండలేక అన్నాడు స్వామినాయుడు పెద్ద కొడుకు రత్తయ్య.

"నర్లే... అయ్యిందేదో అయ్యిందిగాని, కొద్దిగా రేడియో ఎట్టు- వాన ఎప్పుడూ తగ్గుతుందో ఏంటో?!" స్వామినాయుడు కొడుకుతో చెప్పాడు.

రేడియో పెట్టేసరికి బర్ర్ మంటూ శబ్దం.

ఆ బర్ బర్‌ల మధ్యే వార్తలు విన్నా రందరూ. ఇంకా తుఫాన్ 36 గంటలున్నట్లు చెప్పాడు. కృష్ణా, గోదావరి పొంగే ప్రమాద ముందని, అక్కడెక్కడో ఊళ్ళు మునిగిపోయాయని చెప్పాడు.

"ముప్పయ్యారు గంటలే!" గుండెల మీద చెయ్యేసు కొంది రత్తయ్య భార్య లక్ష్మి.

"ఒరే బావా!" బయటి నుండి పిలిచా రెవరో.

దీవం పట్టుకుని బయటకొచ్చాడు స్వామినాయుడు.

గొడుగేసుకుని వచ్చున్నాడు దశరథ రామయ్య. ఇంతలో గాలికి దీవం గుప్పున ఆరిపోయింది.



"ఏటిరా, బావా, ఈ ఏళ వచ్చావ్!" ఆదుర్దా తొంగి చూసింది స్వామినాయుడు కంఠంలో.

"ఏటుంటాయి... కూ సేపటికో, కా సేపటికో ఊరు మునిగేట్లుంది." అరుగుపై కొస్తూ... అన్నాడు దశరథరామయ్య.

"ఏ రెలా వుందో ఏద్దైనా తెలిసిందా?" ఆత్రతగా అడిగాడు స్వామినాయుడు.

"ఏరు పొంగేటట్టుందని ఇప్పుడే లచ్చయ్య అన్నాడు."

"ఏరు పొంగిందంటే మనూరు..." గొంతు వణికింది స్వామినాయుడికి.

"ఏందీ, నాయ్డు, అలా డీలా పడిపోతే ఎట్టా! మన తిప్పలు మనం పడదాము. ఆపైన అన్నింటికీ ఆ పోలేరమ్మ తల్లి వుంది."

దశరథరామయ్య మాటలకి, "ఏం చేద్దామన్రా!" అనడిగాడు స్వామినాయుడు. "ఊరిడిచి



వెళ్ళిపోదామా!" మళ్ళీ తనే అన్నాడు.

"సరి సర్లే, ఉన్న పళంగా వూరు ఖాళీ చేత్తే, మన గొడ్డూ-గోదా ఏటవుతుందో ఆలోచించావా! మనకున్న కాత్తంత ఆధారం ఇక్కడే వున్నదాయె. ఏరుకి గండి కొడదా మనుకుంటున్నాం. మన కీ గండం గట్టెక్కుతుంది." కురుస్తున్న వర్షం కేసి చూస్తూ అన్నాడు దశరథరామయ్య.

"మరందరితో ఆలోచించద్దా!" అన్నాడు స్వామినాయ్డు.

"అందరూ రాఘవయ్య ఇంటికాడ జేర్తన్నారు. నిన్ను కూడా తీసుకుపోదామని ఇలా వచ్చా."

"సరే, నడు." కర్ర చేతిలోకి తీసుకుని, దశరథరామయ్యతో నడవబోయాడు స్వామినాయుడు.

"ఏం, నాన్నా, నన్ను కూడ రమ్మంటా వేంటి!" అడిగాడు రత్తయ్య.

"పెద్దోళ్ళం, మేం ఏడిసాముగా, నువ్వింటికాడే కూకో! ఆడోళ్ళు, పిల్లలు ఉన్నారు." కసురుకొన్నట్లు చెప్పాడు నాయుడు.

ఇద్దరూ నడవసాగారు.

మోకాలి దాకా వచ్చేస్తున్నాయి నీళ్ళు. అడుగు తీసి, అడుగు వేయటం బ్రహ్మప్రళయమైపోతోంది.

శ్యామలాపురంలో నాలుగొందల గడపలదాకా వున్నాయి. ఒకటో, రెండో మిద్దెలున్నాయి. అందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవించే వాళ్ళే!

స్వామినాయ్డు, దశరథరామయ్య రాఘవయ్య ఇంటి దగ్గరకెళ్ళేసరికి చాలా మంది అక్కడికి చేరారు.

ఒకరినొకరు చూపులతో పలకరించుకున్నారు.

"గండి కొట్టటం తప్పదేంటీ?" అన్నా డొకడు.

"ఎలా తప్పుద్రా! గండి కొట్టకపోతే ఏరు ఏ క్షణాన్నైనా ఊళ్ళోకొచ్చేస్తుంది మరీ" అన్నాడు రాఘవయ్య.

అందరూ లాంతర్లూ, పారలు గట్రా తీసుకుని ఏరు దగ్గరకి బయలుదేరారు.

వంతెన దాటి, అవతలి కెళ్ళారు.

ఆ నిశ్శబ్దపు రాత్రిలో ఏరు హోరు పెడుతోంది.

గండి కొట్టటానికి పలుగు, పారతో ముందుకి నడవబోయారు వాళ్ళు.

వాళ్ళలా అడుగేశారో, లేదో దూరం నుండి లాంతర్ల వెలుగు కన్పించింది. పెద్ద పెద్ద కేకలు వినబడ్డాయి.

"వీళ్ళోరస చూస్తుంటే ఎంకన్నపాలేం వాళ్ళల్లా వుందే!" పైకి అనేశాడు రాఘవయ్య ఆ వెలుగుకేసి చూస్తూ.

"పెద్ద తంటా తగులుకుందే లక్ష్మీ కొడుకులు... గండి వెయ్యనివ్వరేమో" చిరాకుపడ్డాడు దశరథరామయ్య.

ఆ వెలుగు దగ్గరపడింది. యాభై మంది కర్రలు, కొడవళ్ళు పట్టుకుని వచ్చిపడ్డారు. వారికి నాయకత్వం వహిస్తున్నారు చంద్రయ్య, సత్యనారాయణ.

"నా కొడకల్లారా! గండేత్తారా! వచ్చుటి ఘ పొలాలన్నీ పొట్టన బెట్టుకుందామనే." వేగంగా ఊపిరి పీలుస్తూ అన్నాడు చంద్రయ్య.

"అది కాదురా, చంద్రయ్యా! గండి కొట్టకపోతే, ఊరు మునిగిపోతుంది. అర్థం చేసుకుని, అడ్డు రామకురా, అబ్బులూ!" నర్దిచెప్పబోయాడు స్వామినాయుడు.

"నోర్మూయ్యెహె! హరికథలు సెబ్తున్నారూ! గండి కొట్టారో... మీ తలకాయలు లేచిపోతాయి." బెదిరించాడు సత్యనారాయణ.

నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు స్వామినాయ్డు మరోసారి.

వినిపించుకోలేదు వారు. పంటలు పోతాయేమోనన్న బాధ వెంకన్న పాలెం వాళ్ళది. ఊరు మునిగిపోతుందేమోనన్న భయం శ్యామలాపురం వాళ్ళది.

"గండి కొట్టండ్రా, ఎవ డడ్డమొస్తాడో చూద్దాం." కర్ర పైకెత్తుతూ అన్నాడు దశరథరామయ్య.

రెచ్చిపోయారు వెంకన్నపాలేం వాళ్ళు. ఎప్పటి నుండో ఆ రెండు ఊళ్ళ మధ్య వున్న గొడవలు గుర్తుకు తెచ్చుకున్నారు.

పాతపగలు ఆవేశాగ్నికి ఆజ్యం పోశాయి. కర్రలు, కొడవళ్ళు పైకి లేచాయి.

పైనుండి కురుస్తున్న వానని ఏ మాత్రం ఖాతరు చెయ్యలేదు ఆ ఇరువర్గాలు.

ఎవరి గ్రామాన్ని వారు కాపాడుకోవాలన్న తలంపు వారిని మూర్ఖులని చేస్తోంది.

లాంతర్లు పగిలాయి. గావుకేకలు పెడుతున్నారు. ఆఖరి అరుపులు అరుస్తున్నారు. బూతులు తిట్టుకుంటున్నారు.

ఆకాశం నిండా చీకటి... క్రింద నేల మీద నీళ్ళు. ఏరు ఉద్ధృతం కాజొచ్చింది. గాలి వింతచప్పుడు చేస్తోంది.

ఏరు దగ్గర జరుగుతున్న గొడవ ఊళ్ళోకి పాకింది.

ఆడవాళ్ళు బెంబేలెత్తిపోయారు. మంగళసూత్రాలు కళ్ళకద్దుకుని, పోలేరమ్మ తల్లికి మొక్కుకున్నారు-"తమ మొగుళ్ళని కాపాడమని". ఇళ్ళ దగ్గరున్న మగాళ్ళూ నడుము బిగించి కత్తులు, కటార్లతో యుద్ధరంగానికి పరుగెత్తారు.

ప్రాణ భయం కలిగించిన ఆవేశం వారందర్నీ ఆలోచనా రహితుల్ని చేసింది.

అక్కడి రక్తపాతం సహించలేక కాబోలు, ఏరు గట్లు తెంచుకొని ఊళ్ళోకి ఉరికింది.

"ఏరు పొంగింది, ఊళ్ళోకి వస్తుందొరయ్." అరుస్తూ పరుగుతీయబోయారు కాని, సుడులు తిరుగుతున్న నీళ్ళు, వాళ్ళని తమలోకి లాక్కున్నాయి.

తెల్లవారింది.

వాళ్ళ రక్తంతో కలిసి, ఏట్లోని బురద నీళ్ళు ప్రవహిస్తున్నాయి.

రాబందులు రెక్కలాడిస్తూ, లాకులవైపు ఎగురుతున్నాయి కొట్టుకొచ్చే శవాలను పీక్కుతినడానికి.

(ఈ కథకి ప్రేరణ, ప్రాణం మనుమల మూర్ఖత్వం)

●